క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిర్పూర్(టి): కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ఇర్ఫాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈస్‌గాం సబ్‌స్టేషన్‌లో 132 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా సిర్పూర్(టి), లోనవెల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.
కాగజ్‌నగర్‌టౌన్: ఈస్గాం 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కాగజ్‌నగర్ విద్యుత్ శాఖ ఏడీఈ పి.శ్రీనివాస్ తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలోని కాగజ్‌నగర్ పట్టణం మినహా అన్ని మండలాల్లో బుధవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆధార్‌కార్డు లింక్ తప్పనిసరి

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనికి వెళ్తున్న జాబ్‌కార్డు దారులు తప్పనిసరిగా ఉపాధిహామీ జాబ్ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయించుకోవాలని ఈవో కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధిహామీ కూలీలు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించి ఆధార్ లింక్ చేసుకోవాలని సూచించారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏవో వంశీక్రిష్ణ

దహెగాం: మండలంలోని గిరవెల్లి తదితర గ్రామాల్లో మంగళవారం అంతర్జాతీయ చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ముందుగా గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏవో వంశీక్రిష్ణ మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాల పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. రాగులు, సజ్జలు, కొర్రలు, సామలు వంటి పంటలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సుష్మిత, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

సిర్పూర్(టి): మండలంలోని మైనార్టీ కార్పోరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న దరఖాస్తు దారులకు ఈనెల 31న మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి దరఖాస్తుదారుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

రైతులు రుణాలు చెల్లించాలి


మాట్లాడుతున్న మేనేజర్ హబీబుల్లా

కెరమెరి: తీసుకున్న రుణాలను రైతులు చెల్లించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ హబీబుల్లా అన్నారు. మంగళవారం మండలంలోని లక్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనేక మంది రైతులు రుణమాఫీ కోసం చూస్తున్నారని, రుణాలు చెల్లించినా రుణమాఫీ వర్తిస్తుందని అన్నారు. ఆయన వెంట ఆసిఫాబాద్, వాంకిడి బ్యాంకు మేనేజర్లు విశ్వనాథ్, విష్ణువర్ధన్, ఐకేపీ సీసీలు ఉన్నారు.

బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నూతన కమిటీ

కౌటాల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షుడిగా డబ్బా గోపాల్, ఉపాధ్యక్షుడిగా రావుల వినోద్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్, కార్యదర్శులుగా భాస్కర్, ఉమేష్, సాయి, కోశాధికారులుగా ప్రసాద్, వక్త ఇంద్రసేన్, శ్రీహరి, కార్యనిర్వహణాధికారులుగా గోపి, అవినాష్, మీడియా కన్వీనర్‌గా మహేష్, రవికిరణ్, సలహాదారులుగా నక్క సుధాకర్, రావుల ప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు రేగుల రాజు, జిల్లా నాయకులు దుర్గం వినోద్, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

వసంత పంచమి వేడుకలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో గురువారం వసంత పంచమి వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు గుండేటి కోటేశ్వర్ రావు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు గాయిత్రీ యజ్ఞము, విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి


మాట్లాడుతున్న ఎంపీపీ దుబ్బుల నానయ్య

- ఎంపీపీ డుబ్బుల నానయ్య
- సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

చింతలమానెపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ మండలంలో అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఏఈవోలు స్థానికంగా అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. మిషన్ భగీరథ పైపులు లీకేజీలకు గురవుతున్నాయని, గ్రామాలలో తాగునీటి సరఫరా జరగడం లేదని సభ్యులు తెలిపారు. దీంతో నిధుల కొరత కారణంగా పనులు చేయలేక పోతున్నామని, నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని మిషన్ భగీరథ అధికారులు సమాధానం ఇచ్చారు. మండలంలోని పలు పాఠశాలల్లో సిబ్బంది కొరత ఉందని సభ్యులు తెలుపగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి తరగతులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎంఈవో సోమయ్య అన్నారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు మండల వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై నివేదికలు చదివి వినిపించారు. కాగా పూర్తిస్థాయిలో అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మషాక్ర్ అలీ, జెడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, ఎంపీడీవో మహేందర్, వైస్ ఎంపీపీ మనోజిత్ మండల్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు బదులుగా కుమారుడు


సమావేశంలో డబ్బా గ్రామ సర్పంచ్ కుమారుడు రషీద్


సర్పంచ్ తాహెరా పేరుతో సంతకం

చింతలమానెపల్లి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో డబ్బా సర్పంచ్ తాహెరా బేగంకు బదులుగా ఆమె కుమారుడు అబ్దుల్ రషీద్ హాజరు కావడం వివాదాస్పదమైంది. సమావేశానికి అబ్దుల్ రషీద్ హాజరు కావడం ఏంటని తహసీల్దార్ మష్కూర్ అలీ ప్రశ్నించడంతో ఎంపీపీ అనుమతితో నిబంధనల ప్రకారం సమావేశానికి ఒకరు హాజరు కావచ్చని ఎంపీడీవో మహేందర్ తెలిపారు. కాగా రిజిస్టర్‌లో హాజరైన వారి సంతకాల స్థానంలో సర్పంచ్ కుమారుడు సర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీ చేశారు. సర్పంచ్ హాజరైనట్లుగా తాహెరా పేరుతో సంతకం చేశారు.

మెరుగైన వైద్య సేవలందించాలి


పీహెచ్‌సీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కౌటాల(సిర్పూర్): రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. కౌటాల మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేసి వైద్య సేవల గురించి ఆరా తీశారు. గర్భిణులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు పెంచాలని సూచించారు. ఆస్పత్రికి ప్రభుత్వం అదనపు గదిని మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించారు. విద్యార్థుల సరిపడా అదనపు తరగతి గదులు నిర్మించాలని ప్రిన్సిపాల్ అదనపు కలెక్టర్‌కు విన్నవించారు. పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి అన్ని రకాల మొక్కలు సంరక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. జీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీడీవో నస్రుల్లా ఖాన్, ఎంపీవో సుధాకర్‌రెడ్డి, వైద్యాధికారి నవత, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

క్యాంటీన్ పరిశీలన

పేదవారికి తక్కువ ధరకే భోజనం అందించేందుకు మా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో కౌటాల స్వయం సహాయక సంఘం సహకారంతో కౌటాలలో మాకి రోటి క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. మంగళవారం కౌటాలలో పర్యటించిన జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ క్యాంటీన్‌ను పరిశీలించారు. రూ.15కే కూర, పప్పు, అన్నంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. క్యాంటీన్ నిర్వహణకు పక్కా గది నిర్మించి ఇవ్వాలని వారు కోరారు. అనంతరం క్యాంటీన్‌లో అదనపు కలెక్టర్ భోజనం చేశారు. ఆమె వెంట ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంపీవో సుధాకర్‌రెడ్డి, ఏపీఎం వెంకటరమణ, తదితరులు ఉన్నారు.

సాయిరాంరెడ్డికి ఘన స్వాగతం

కాగజ్‌నగర్‌టౌన్/కౌటాల: హిమాలయ పర్వతాల్లో ఒకటైన కేదారికాంత్‌ను అధిరోహించి మంగళవారం కాగజ్‌నగర్‌కు చేరుకున్న కారెం సాయిరాంరెడ్డికి కాగజ్‌నగర్ పట్టణ ప్రజలు, సొంతూరు కౌటాల మండలం ముత్తంపేట గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. నిత్యాన్నదాన కేంద్రాన్ని సందర్శించగా జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు ఘనంగా సత్కరించారు. ఫణికుమార్, వసీం, వనమాల, రాము, మహెబూబ్, హబీబ్ ఖాన్, వంశీ, మున్సిపల్ కౌన్సిలర్లు శివకుమార్, ఎల్లేష్, పాల్గొన్నారు.

ఘనంగా బాలికల దినోత్సవం


ఆరోగ్య కిట్లు అందజేస్తున్న సఖీ సిబ్బంది


రెబ్బెన: కరాటే సాధన చేస్తున్న విద్యార్థినులు

రెబ్బెన: మండలంలోని లేతన్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, రెబ్బెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వంకులం పాఠశాలల్లో మంగళవారం బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా లేతన్‌గూడ పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గులు, చిత్రలేఖనం, గన్నీబ్యాగ్ రన్నింగ్ పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌తో పాటు, వంకులం పాఠశాలలో ఉచిత కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు దొడ్డిపట్ల రవికుమార్, చరణ్‌దాస్, మాస్టర్ చాపిడి కుమార్, ఉపాధ్యాయులు సాయికృష్ణ, మహమ్మద్ అనీస్ అహ్మద్, జమునాదాస్, గోపాల్, శ్రీధర్, తుకారం, శేఖర్, సదానందం, దేవేందర్, శ్రీదేవి, పార్వతి పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో..

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు కరాటే శిక్షణ ప్రారంభించినట్లు జిల్లా సెక్టోరియల్ అధికారులు సత్తయ్య, సుభాష్ తెలిపారు. అనంతరం బాలికల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.

చట్టాలపై అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్: బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని సఖీ సభ్యురాలు సౌజన్య అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో మోడల్ స్కూల్ విద్యార్థినులకు బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికల వాసన్ సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య కిట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ బాలికలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలకు ఎవైనా సమస్యలు వస్తే 1098, 181కు కాల్ చేస్తే సఖీ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, వాసన్ సంస్థ ప్రతినిధి రవీందర్, తిరుపతి, అనిల్, జయవర్ధన్, సఖీ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


రెబ్బెన: ముగ్గులు వేస్తున్న బాలికలు

ఘనంగా భక్త మార్కండేయ జయంతి


కాగజ్‌నగర్‌లో శోభాయాత్ర ప్రారంభిస్తున్న భక్తులు


రెబ్బెన: పూజలో పాల్గొన్న జీఎం దేవేందర్

కాగజ్‌నగర్‌టౌన్: మార్కండేయ స్వామి జయంతిని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఓల్డ్ కాలనీలో గల శ్రీ ఉమామహేశ్వర మార్కండేయ ఆలయంలో పూజలు జరిపారు. ముందుగా ఆలయ అర్చకులు పరికిపండ్ల రుణాకర్ గణపతి పూజతో పాటు స్వామి వారికి అభిషేం నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి పట్టణ పురవీధుల గుండా మార్కండేయ స్వామి శోభయాత్ర వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం పదాధికారులు దాసరి వెంకటేష్, కొంగ సంపత్, నల్ల కృష్ణ, గడదాసు నారాయణ, బూర సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మార్కండేయ జయంతిని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు బంక రోహిదాస్ నాయకులు నాగుల మహేశ్, శేఖర్, అశోక్, రవి తదితరులు ఉన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో మంగళవారం మార్కండేయ జయంతిని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు బొద్దున సత్యనారాయణ మార్కండేయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లక్ష్మణ్, చిప్ప మల్లయ్య, బూర్ల రవి, శేఖర్, సత్యనారాయణ వెంకటేశ్వర్, రాజన్న, శ్రీనివాస్, అశోక్, సాయి, పురుషోత్తం పాల్గొన్నారు.

బెజ్జూర్: భక్త మార్కండేయ స్వామి జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మార్కండేయ తాత్కాలిక ఆలయ నిర్మాణం చేపట్టారు. పద్మశాలి కుల బాంధవులు భక్త మార్కండేయ స్వామి చిత్రపటాన్ని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. చిత్రపటానికి క్షీరాభిషేకం జరిపి జెండా ఆవిష్కరించారు. పద్మశాలి సేవా సంఘం మండల అధ్యక్షుడు సామల తిరుపతి, ప్రధాన కార్యదర్శి కనికుట్ల వెంకటేష్, కృష్ణపెల్లి సర్పంచ్ వడ్డేపల్లి లావణ్య శ్రీనివాస్, ముంజంపల్లి ఉపసర్పంచ్ అశోక్ పాల్గొన్నారు.

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ భవనం వద్ద మంగళవారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. మార్కండేయ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. బెల్లంపల్లి ఏరియా జనరల్‌మేనేజర్ కాజాల దేవేందర్ హాజరై పూజలు చేశారు. సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పోషయ్య, సొసైటీ అధ్యక్షుడు వీరస్వామి పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో మంగళవారం పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీమార్కండేయ జయంతి కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేదపండితులు గణపతి హోమం, ధ్వజారోహణం, పూర్ణాహుతి, మహా మంత్రపుష్పం నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి పట్టణంలోని పొట్టి శ్రీరాములుచౌక్, గాంధీచౌక్, వివేకానందచౌక్, అంబేద్కర్ చౌకల మీదుగా మార్కండేయుడి చిత్రపటంతో శోభాయాత్ర చేపట్టారు. మహిళలు కోలాటం ఆడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు జంజిరాల శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, రాజు, లింగయ్య, శ్రీకాంత్, ధర్మయ్య, విజయ, మంగ, సునీత, పుష్పలత పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే పోలీసుల ధ్యేయం


దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ, ఎస్సైలు

తిర్యాణి: ప్రజల శ్రేయస్సే పోలీసుల ధ్యేయమని సీఐ అల్లం నరేందర్, ఎస్సై రమేశ్‌లు అన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఇస్లాంబుగ్గ, కొలంగూడ గ్రామంలో 50మంది గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ అభివృద్ధిని అడ్డుకుంటున్న అసాంఘిక శక్తులకు ఆదివాసీలు ఎట్టి పరిస్థితుల్లో సహకరించొద్దని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వల్క రాంచందర్, తోట లచ్చన్న తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న జెడ్పీ చైర్‌పర్సన్


క్షతగాత్రులను పీహెచ్‌సీకి తరలిస్తున్న కోవ లక్ష్మి

కెరమెరి: కెరమెరి ఘాట్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవ లక్ష్మి పీహెచ్‌సీకి తరలించి మానవత్వం చాటుకున్నారు. మంగళవారం కెస్లాపూర్ నాగోబా జాతరలో కొనసాగే దర్బార్‌లో పాల్గొనేందుకు కోవ లక్ష్మి వెళ్తుండగా కెరమెరి ఘాట్ రోడ్డు వద్ద ట్రాక్టర్ బోల్తా కొట్టింది. ట్రాక్టర్‌లో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా గమనించిన కోవ లక్ష్మి వెంటనే 108కు కాల్ చేసి, వారిని వైద్యం నిమిత్తం జైనూర్ పీహెచ్‌సీకి తరలించారు. కాగా గాయపడిన వారు ఉట్నూర్‌కు చెందిన వారిగా గుర్తించారు.

న్యూట్రిషన్ కిట్లు అందజేత


కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతువేదికలో మంగళవారం ఆరుగురు మహిళలకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గర్భిణులు, పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సత్యనారాయణ, కోఆర్డినేటర్ శ్యాంలాల్, సిబ్బంది రజిత, లావణ్య, సువర్ణ, రాము గౌడ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వేణుగోపాలచారిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు


పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

రెబ్బెన: ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన వేణుగోపాల చారిని మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని ఐడీసీ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా శుభాకాంకలు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ కార్నాథం చంద్రయ్య, రెబ్బెన ఉప సర్పంచ్ మడ్డి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ బొమ్మినేని శ్రీధర్, కోఆప్షన్ సభ్యుడు జహూరోద్దీన్ పాల్గొన్నారు

పండిత్, పీఈటీల నిరసన

పెంచికల్‌పేట్: పండిత్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసిన అనంతరం పదోన్నతులు చేపట్టాలని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో మంగళవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ అప్‌గ్రేడ్ చేయకుండా పదోన్నతులు చేపడితే తీవ్రంగా నష్టపోతామన్నారు. నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, విజయ్‌కుమార్, రమాదేవి, భానుప్రకాష్, సుజాత, సమ్మయ్య, నగేష్, లక్ష్మి, కళావతి, భారతి, భారత రతన్న, శ్రీనివాస్, నదియా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

తిర్యాణి: ఈనెల 26 నుంచి 28 వరకు మండలంలోని సుంగాపూర్ గ్రామంలో నిర్వహించే భీమన్న జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఆదివాసీ సంఘాల నాయకులు గంగరాం, కోర్వేత తిరుపతి తదితరులు ఉన్నారు.

త్రిశూల్ పహాడ్‌లో భూ వివాదం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని త్రిశూల్ పహాడ్‌లో మంగళవారం స్థలం వివాదం చోటుచేసుకుంది. ప్రభుత్వం కొన్నేళ్ల క్రితం నాలుగో తరగతి ఉద్యోగులకు స్థలాలు కేటాయించింది. కాగా ముగ్గురు ఉద్యోగులకు సంబంధించిన స్థలాలను పలువురు ఆక్రమించుకొని గుడిసెలు వేసుకున్నట్లు వారు ఆరోపించారు. కాగా గుడిసెలు వేసుకున్న మహిళలు తమకు రెవెన్యూ అధికారులు ఇంటి స్థలాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. దీంతో వారి మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ విషయమై బాధితులు రెవెన్యూ అధికారులతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కార్మికులను క్రమబద్ధీకరించాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: 20 సంవత్సరాలుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కార్మికులతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనంగా రూ.24వేలు చెల్లించాలన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ కార్మికులకు వేతనాలను పెంచాలన్నారు. వేతనాలు పెంచేలా నూతన టెండర్లకు నోటిఫికేషన్‌ను విడుదల చేయని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు హరీశ్, గుణవంత్‌రావ్, సత్తర్ బేగ్, మమత, నీలిమ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లోకేశ్, లింగయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కార్మికులకు బోనస్, ఫోన్‌బిల్లు, పెట్రోల్ అలవెన్స్ కింద రూ.5వేలు చెల్లించాలన్నారు. సమ్మె కాలంలో ఒప్పుకొన్న 14 డిమాండ్లు అమలు చేయకుంటే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. సమావేశంలో దేవేందర్, శ్రీనివాస్, జాదవ్, సంతోష్, హరీశ్, బాలేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పాశుపత హోమం


హోమంలో పాల్గొన్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బాలేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి పురస్కరించుకొని నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రుల్లో మూడో రోజులో భాగంగా మంగళవారం ఆలయంలో మన్యుహోమ సహిత అఘోర పాశుపత హోమం, సుబ్రహ్మణ్యమాల మంత్ర హోమ పూర్వక రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు చందావార్ రవిచంద్ర శర్మ, శ్రావణ్ శర్మ, శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు చందావార్ బాలేశ్వర శర్మ, డిల్లీ విజయ్‌కుమార్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


చెక్కు అందజేస్తున్న ఎంపీపీ

తిర్యాణి: రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల రుణమేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు తీసుకున్న రుణాలను తిరిగి నెలనెల సక్రమంగా చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతరాజు, గ్రామీణ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, సర్పంచులు కోర్వేత సింధూజ, విమలాబాయి, అర్చన, ఏపీఎం సదానందం, సీసీలు రాజేశ్వర్, సంతోశ్ కుమార్, కవిత తదితరులు ఉన్నారు.